# మాటలో మమత

శ్రీ ద్వివేదుల సోమనాథశాస్త్రి

"అత్తలేని కోడలు సుఖవంతు రాలూ..."

"కోడలూ లేని అత్త గుణవంతురాలూ..." అని చిన్న కూనిరాగం తీస్తూంది చింత పండు తీస్తూ ఒకావిడ—

"అత్త అంటే జ్ఞాపకం వచ్చింది-చూశావూ! ఆ లక్ష్మమ్మ కోడలు-ఆవిణ్ణి అత్తా అని పిలవదుట!" అని అంది సముద్రాలు విస్తరు కుడుతూ.

"అలాగా! ఎంచేతో! సిగ్గో ఏమిటో!" అంది—ఒత్తులు వలుపుతూ ఒకావిడ.

"సిగ్గేమిటి? అదో యిది-సాధారణంగా ఎలాగూ పిలవదుట! ఒట్టి ముభావంగా మాటాడుతుంది! యింక ఏనాడయినా పిలవ్వాలిసి వస్తే 'ఏమండీ' అని మొగాళ్లని పిలిచినట్టు అంటుందిగాని నోరారా ఆ ముక్క అనదు!"

"బావుంది! యిదెక్కడా వినలేదు! పెద్దింటి పిల్లకదూ! పరువు, నామోషికం కాబోసు!"

"ఆఁ! లక్షాధికారి కూతురా; కోటీశ్వరుడి కూతురా; అలాగంటావు? అయినా గొప్పవాళ్ల పిల్లయితే మాత్రం అలా పిలవకూడదని వుందా ఏమిటి!"

"చక్కా అత్తాఅనో, అత్తగారూ అనో పిలిస్తే ఎంత బావుంటుంది? ఆవిడ మనస్సు ఎంత సంతోషిస్తుంది!"

"అయినా ఎందుకలా పిలుస్తుంది! అంత గర్వం కూడదు!"

"అబ్బే గర్వం గిర్వం లేదుగాని-ఇలా అడుగుతే-నాకు 'తెలీదండీ' అని అంటుంది!"

"బావుంది ఏమని పిలవాలో తెలీదూ! ఎంత ముద్దరాలమ్మా! ఇలాంటి ముద్దూ ముచ్చట్లకోసమేకదా వాళ్ళని తెచ్చుకొనేది!"

"అవును మరి! ఒక్కగా నొక్క కొడుకు మరి ఆవిడని అత్తా అని నోరారా పిలవడానికి, విని, సంతోషించడానికి-యింకెవరున్నారు? యిలా అయితే ఆవిడ మనస్సు క్షోభపడదూ!"

"పాపం! ఆవిడ ఎంత నొచ్చుకుంటూందో!"

"ఏమో లోపునే మనుకుంటూందోగాని పైకిమాత్రం, అంత అలా ఏమీ అనుకున్నట్టు కనిపించదు! అయినా యీ మధ్య మాటల్లో ఒకసారి అంది-తనని అలా పిలవదు అని-అయినా ఆ ఒక్క కోడల్ని ఏరికోరి తెచ్చుకున్నందుకు ఆవిడకా సరదా తీరింది కాదు!"

"అందరిలాంటి మనిషి ఆవిడ కాదు కాబట్టి సర్దుకుపోతూంది-మన దగ్గిర అలా పిలవడానికి సిగ్గుపడుతూందేమోగాని యింట్లో పిలవక అవుతుందా?"

"అయ్యో లేదమ్మా! ఎక్కడైనా యిదే వరస! లేకపోతే అనుకోడం దేనికి? అయినా మన కెందుగ్గానీ..."

"యీ కాలపు పిల్లలికి యిదో పెడసరం! ఏమైనా అంటే యిదవుతారు—గాని—అత్తా అని పిలిస్తే దాని కొంపేం మునిగి పోయింది! వజ్రాలూ, వైఢూర్యాలూ, రాలిపోతాయా?"

"కొంచం గట్టిగా చెప్పిచూస్తే పిలవకేం చేస్తుంది. దాని మొగుడేనా కేక లెయ్యకలేదూ!"

"అదేం చిన్నపిల్లా చితక పిల్లా! దానంతట అది నేర్చుకొని గ్రహించుకోవాలి గాని యీపాటిదానికోసం జట్టీ లాడుకుంటారా?"

"మొదట్లో అయితే కొత్తకాబట్టి సిగ్గు పడుతూంది అనుకున్నాం గాని, మూడేళ్ళయి కాపరానికి వచ్చినా ఒక్కలాగే వుందాయె!"

"మరోపాటి వాళ్ళయితే యీ పాటికి వీధిని పడి పోయివుందురు...చిన్నపిల్ల... రానురాను అనుభవంమీద దానికే తెలుస్తుంది!"

"ఇంకేం తెలుస్తుంది...యింకా మొండి కెత్తి యిదే అలవాటయి పోతుంది...... పిల్లల్ని కనే యీడొచ్చి యిదే యిలా పిలవకపోతే యింకా ఆ మనవలు వరసలు పెట్టి" పిలుస్తారని ఎలా అనుకుంటాం? పేర్లు పెట్టి, పిలుస్తే సిగ్గుసిగ్గు!"

"అదీకాక వాళ్ళేం పట్టించుకోక వూరుకున్నారుగాని వాడు నాలుక్కేక లేస్తే పిలవకేం జేస్తుంది!"

"ఆ మాట పుట్టేది! యింకా ఆవిడ ఏమైనా అంటుందేమోగాని వాడు పల్లెత్తు మాటయినా అనడు...సరికదా! వీధిలో మనలాటివాళ్ళ మాటలు విని ఎక్కళ్ళ నేర్చుకుంటుందో అని - ఎక్కడికీ వెళ్ళ నివ్వడు తెలుసా?"

"అంత వాడయేడూ?"

"ఇంకా ఏం జూసేవూ! యింట్లో ప్రతీద్వారానికీ ఘోషావాళ్ళలా తెరాలు కట్టేశాడు...ఆరంభకి దిష్టి తగులుతుందని.. యింత ఘోషాలో వుంచి కట్టుజేస్తున్నాడు...!"

"స్వతః పుట్టుక రావాలిగాని వీడెంత చెస్తేమాత్రం ఏం లాభం? అయినానిన్నటి వరకూ మన కళ్ళముందు ఆడుకొనేవాడు! ఎంత వాడయిపోయాడు?"

"మరి పెదవాడవడం లేదూ?"

"అందికే కాబోసు మనం లక్ష్మమ్మతో కూర్చుని వాళ్ళ గుమ్మంలో మాటాడు కున్నా అది పైకి రావడంలేదు—"

"అవును...వాడే.. వద్దని చెప్పేడట!"

"ఇహ రెండురోజులు పోయాక ఎవర్నీ గుమ్మం ఎక్క నివ్వడు కాబోసు!"

"అంతవరకూ ఎందుకూ? మొన్న ఆ సూరమ్మా! రావమ్మా! జట్టీ లాడుకొని వాళ్ళ సోది వెళ్ళబోసుకుందికి వాళ్ళింటి కెళితే—'ఇహమీదట యిలాంటి మాటలు మా యింట్లో చెప్పడానికి వీల్లేద'ని, 'యిలాంటి మాటలాడిన వాళ్ళని, చెప్పడానికి వచ్చినవాళ్ళని, గుమ్మం ఎక్కనివ్వనని యింకా ఏవేవో అని వాళ్ళని పొమ్మన్నాడుట తెలుసా!"

"ఆఁ! ఏమిటే! ఇదంతా పెళ్లాంపాడయి పోతుందనే కాబోసు! లోకంలో వీడొక్కడే పెళ్ళాన్ని పెళ్ళాడాడా ఏమిటి! అయినా వాడంత వద్దంటూంటే ఎవరికంత ఖర్మం వాళ్లింటి కళ్ళేవరకూ? యీ బుద్ధి ఎలా పుట్టిందో గాని యింతకుపూర్వం ఎరగడు—"

"ఇంతలా వాడంటున్నా ఆ లక్ష్మమ్మ వూరుకుందా ఏమీ అనక?"

"ఆవిడేం చేస్తుంది! ఏమైనా అంటే వాడు—'నా ఇష్టం' అంటాడు."

"బావుంది...ఇరవై ఏళ్ళబట్టీ...అందరికీ అలవాటయిపోయింది వాళ్ళింట్లో కూర్చుని కష్టం వచ్చినా సుఖం వచ్చినా మాటాడుకోడం! వాళ్ళ తాతయ్యా వాళ్ళూ ఎంతోమంది పెద్దవాళ్ళు వుండేవారు గాని వాళ్ళే జోలికే వచ్చేవారు కారు - ఎంతమంది ఆడవాళ్ళు గుమ్మంలో వున్నా దించిన తల ఎత్తకుండా ఆ పక్కనించే వెళుతూ వస్తూండే వారుగాని ఏనాడయినా యిలా అడ్డు చెప్పేరా? యీనాటికి వీడేనా మహా తెలివయిన వాడు?"

"అబ్బే! వాడూ అలా అనలేదే! వాడి ఖర్మం వాడి పెళ్ళాన్ని వెళ్ళవద్దన్నాడు గాని మనల్నెవర్నీ రావొద్దనీ, చెయ్యొద్దనీ- అనలేదు...మాటొస్తే మంచీ, చెడ్డా, రెండూ అనుకోవాలి!"

"ఆఁ! వాడంటేమాత్రం మనం వెళ్ళడం మానుతామా ఏమిటి?"

"ఇంక వూరుకుందురూ లక్ష్మమ్మ వస్తున్నట్టుంది, వింటే బావుండదు" - అని ఒకావిడ అనేసరికి, అందరూ అటువైపు చూసి అప్పటికా ప్రసంగం మానేసేరు.

* * *

"ఏమండీ లక్ష్మమ్మగారూ పైని గూర్చ



పైబ్రా
గర్భాశయ రోగనివారిణి

సర్వ గర్భాశయ వ్యాధులను పూర్తిగా పోగొట్టి, సత్సంతానమును కలుగ జేయుటలో మా పైబ్రా మిక్కిలి ఘనతవహించినది అన్ని షాపులలో దొరకును

రు. 2-8-0

KL

కృష్ణా లేబరేటరి
బెజవాడ



32 సంవత్సరముల అనుభవముగల
రెడ్డి అండ్ కో., వారి (వైద్యులు)
కుష్ఠు, బొల్లి, సుఖరోగాది
చికిత్సలకు నేడే సంప్రతించండి.
నకలుమందులు చూసి మోసపోకుడు
అన్నిబాషలలో కేట్లాగు ఉచితము.
హెడ్ ఆఫీస్: రెడ్డి అండ్ కో.,
గోపాలపురం.
(తూర్పుగోదావరి)
బ్రాంచిలు:- నెల్లూరు, బెజవాడ, రాజమండ్రి
సికంద్రాబాద్, విశాఖపట్నం, బరంపురం
మొదలగు పట్టణములలో.



గనోక్యూర్
అన్నిసెగలకు గంటలలోగుణము
ఈశ్వర ఫార్మశి, రాజమండ్రి.


న్నారు? ఇంట్లో ఎవరూ లేరా ఏమిటి? యివాళ అగ్గిపుల్లలు యింట్లో నిండుకున్నాయి కొస్తే నిప్పు పట్టుకు వెడతాను" -అంది కొరటాలు ఇనపగరిట చేత్తోపట్టుకు వచ్చి వీధిలో కూర్చున్న లక్ష్మమ్మని చూసి—

"వెళ్ళమ్మా! వాడి పెళ్లాం వుంది ఇస్తుంది!"

"అదేవిటండోయ్! అలా అంటున్నారు వాడి పెళ్లాం ఏమిటి కోడలనక?"

"ఇంకెందుకమ్మా! నన్నది అత్తా అని పిలిస్తే లోకువయిపోతుంది, అంచేత నేను మాత్రం కోడలా అని పిలుస్తే తక్కువయిపోనూ? యిహనుండి నేనూ అలా పిలవదల్చుకోలేదు - నాకేల -" అంది నవ్వుతూ లక్ష్మమ్మ.

"బావుందమ్మా! బావుంది! అత్తా కోడళ్ల మధ్య యిలాంటి పేచీ ఎక్కడా చూడలేదు-యింట్లో పెత్తనంకోసమో-డబ్బుకోసమో-అధికారంకోసమో, మర్యాదకోసమో, జట్టీలాడుకుంటారు గాని—"

"అలాంటి లేవీ మీ ధర్మాన్న లేవులెండి అయినా యిదో పేచీ అని ఎవరన్నారు, అలా పిలవనంత మాత్రంలో పోయిందేమిట-చిన్నపిల్ల-వుట్టినే హాస్యానికి అలా అన్నాను అంతే—"

"మీ రేమనుకుంటున్నారోగాని వీధిలో వాళ్లు మాత్రం వూరుకోలేదు మీ కోడలు, గొప్పింటి బిడ్డట-అంచేత, అత్తా అని పిలవడానికి, పరువు తక్కువట! యింకా వూరంత గర్వం, పెడసరంట! యింకా యిలా ఏమిటో నానా మాటలూ ఈ చెవిని వినడం, ఆ చెవిని వదిలేయడంగాని యిలాటివి నాకు జ్ఞాపకం వుండవు" వాళ్ళే అనాలిగాని నే చెప్పలేను"

"ఇందులో ఏమిటి తప్పుందని యీపాటి దానికి అంతలా అనుకుంటున్నారు? మాకేవీ లేనిది మధ్యవాళ్ళ కెందుకండీ!"

"అదేమిటో నాకేం తెలుసు! ఘోషావాళ్ళలా మీరు యింట్లో జేరాలు కట్టుకున్నారట! మీ వాడు యింటి కెవర్నీ రావొద్దన్నాడట! వాడి పెళ్లాన్ని వీధిలో ఎవరితోనూ మాటాడవద్దన్నాడట? ఎక్కడికీ వెళ్లొద్దన్నాడట యిలా మీ వాడు అన్నాడనీ అందరూ అనుకుంటూంటే మీతో చెప్పేను నాకేం తెలుసమ్మా!"

"ఇది విని లక్ష్మమ్మ ఆశ్చర్యపోయింది"

"ఇంత వుంటే అంతచేస్తారు మా వాడేం-అంత తెలివితక్కువవాడు కాదు మనం పెద్దవాళ్లం ఏమనుకుంటే వాడికేం వాడీ సుఖకేరాడు-పైకి నాజూకుగా వుండాలని ఆకట్టెన్లూ అవీ కట్టేడు గాని, అందరూ... యిలా ఘోషాలనీ, అదనీ ఇదనీ అర్థాలు తీసి అనుకుంటారనా? అలాటి మాటలెప్పుడూ వాడనలేదు అయితే మనందరితోనూ బాతాఖానీచేస్తూ వుట్టినే కూర్చునే కన్న చదువుకోడమో, అల్లుకోడమో, మరేవో పనికొచ్చే పని చేసుగుంటే మంచిదన్నాడు గాని, ఎవరితో మాటాడవద్దని గాని ఎక్కడికీ వెళ్ళవొద్దని గాని అనలేదు! ఇదుగో పులి అంటే అదుగో తోక అంటారు! యింతకీ ఎవరా అన్నది—" అని చెబుతూ అడిగింది ఆవిడ—

"ఎందుకులే అమ్మా! తెలుస్తే నన్ను నవకార్థాలూ పెట్టి తిడతారు!"

"ఫరవాలేదు చెప్పండీ!"

"ఎవరితో అనకండి గాని, యింకెవరూ మొన్న ఆ సూరమ్మా, కామమ్మ మీ యింటకొస్తే మీవాడు పొమ్మన్నాడు కదూ! వాళ్ళే పుట్టించుగొచ్చారు యిదంతా! నాలాంటి వాళ్ళకేం బాధ లేదు గాని, వాళ్లిద్దరూ వూరుకుంటున్నారా! లేనిపోనివన్నీ కల్పించి చెబుతున్నారు"

"బాగానే వుంది కానీండి"

"ఆమధ్య—వనాలూ వాళ్లూ జట్టి ఆడుకోగా—ఆ వనాలు కూతురు—ఏడుస్తూ వచ్చి మీ గుమ్మంలో కూర్చుందనీ, అదీ మీవాడు చూసి—'మా యింటిగుమ్మంలో కూర్చుని ఏడిచావంటే ఒప్పుగోనని, వెంటనే పోతావా? పోవా?' అని తగిలేశాడనీ అంటున్నారు! చూశావా!"

"అవునమ్మా! ఎక్కడెక్కడో ఆడుకున్న జట్టీలన్నీ యిక్కడ మా యింటిలోకి వచ్చి వర్లిస్తూ గోల పెడితే వాడికి కిట్టదు - వాళ్లూ వాళ్లూ - తన్నుకొని మా ఇంటో— అర్థరాత్రప్పుడు ఏడవడానికొస్తే ఏమైనా బావుందా? అందికే పొమ్మన్నాడు! యిందులో తప్పేమిటి? వాళ్ళకి ఒదిగి వుండడానికి - మాకేం ఖర్మం—"

"అలాగ చెప్పు! అయినా ఎంత ఓపూయిత్యం లేదమ్మా! ఒకరింటికి అర్థరాత్రప్పుడు వచ్చి మొర్రోమని ఏడుస్తూకూర్చుందికి—? మంచి పనే చేశాడు! అంతి నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలు!"

"అవునా! మరి అందరిదగ్గరా అలా చెబుతూంటే బావుందా!"

"తెలివితక్కువవాళ్ళతో మనకేం పని,

# అతిమూత్రవ్యాధి వారం రోజులలో నెమ్మదించును

మూత్రంలో అధికంగా చక్కెరపోవుట, అతిమూత్రవ్యాధిఅంటారు (Diabetes) ఇది యెంత ఉపద్రవకరమైన వ్యాధిఅంటే, దీని పాలబడినవారు ఆరోజు కారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు దీనికి డాక్టర్లు ఇన్‌సులిన్ ఇన్‌జెక్షన్ మాత్రమే కనిపెట్టారు వాటివల్ల వ్యాధి పూర్తిగా నయం కానేకాదు ఇన్‌జెక్షన్ల గుణము వున్నంతకాలం మాత్రం చక్కెర తాత్కాలికంగా నిలిచిపోతుంది. ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి దాహం, ఆకలి తరచుగా చక్కెరతో మూత్రం బయలు వెడలటము, దురద మొదలైనవి ఈ వ్యాధి ముదిరితే రాచపుండు, కురుపులు కంటిపొర ఇతర చిక్కులు సంభవించును వీనస్ ఛారమ్ ఆధునిక శాస్త్రంలో అద్భుతమైన చికిత్స, దీన్ని వాడటంవల్ల వేనకు వేలమంది మృత్యుముఖంనుండి బయటపడ్డారు. దీన్ని వాడితే రెండవ లేక మూడవ రోజునుండే మూత్రంలో చక్కెర తగ్గించి అత్యధికమూత్రం గూడ నివారిస్తుంది మూడు రోజుల తరువాత మీకు బాగా తేలిక యిస్తుంది దీనికి పత్యం లేదు ఇన్‌జెక్షన్లు అవసరం లేదు, ఇంగ్లీషులో వివరములుగల కరపత్రానికి వ్రాయండి ఉచితంగా పంపుతాము

50 బిళ్లల బుడ్డి ఖరీదు రు 6-12-0 లు

ప్యాకింగు పోస్టేజి ఉచితము

వీనస్ రీసెర్చి లేబరేటరీ,

పోస్టుబాక్సు నం. 587, కలకత్తా (A P. W)



## అబలసుధ

స్త్రీల కుసుమ వ్యాధులు అకాల వాష్టు, ఋతుబద్ధము, ఋతుశూల, ఒడలునొప్పులు, తలనొప్పి, గుండెదడ కాళ్లు లాగుట, మనస్తిమితము లేకపోవుట, నిద్రపట్టకుండుట, నడుమునొప్పులు, బలహీనత, మలబద్ధము, హిస్టీరియా మొ॥ హరించును

సీసా రు 3/- వి పి అ 0-14-0

ఇండియన్ మెడిసన్ హౌస్,

లక్ష్మీ టాకీసు రోడ్డు - విజయవాడ- 2


పూరుకోమ్మా! వాళ్ళనుకున్నంతలో నీకేం పోయింది!"

"అయినా ఒకళ్ళగొడవ అందరికీ ఎందుకో!"

"నే వెళ్ళొస్తానమ్మా! యింకా వండుకోవాలి!" అని చెప్పి కేరటాలు నిప్పు దీసుకు వెళ్ళిపోయింది.

ఈవిడ వెళ్ళిపోగానే లక్ష్మమ్మకి ఏమీ తోచక యింట్లోకి వెళుతూ, గదిలో ఆమె కొడుకు—కోడల్ని కేక లేస్తూన్నట్టు వినిపించి, కొంచెం ఆగింది—

"నా మాటకేం గాని చూశావా! ఆఖరికి నువ్వు అలా పిలవ లేదని ఎంతలా, ఎన్ని విధాల అనుకుంటున్నారో ." దీనికి కోడలి జవాబు వినపడలేదు. అతనిగొంతుకే వినబడుతూంది.

" . ... . "

"నీ కసలు ఆ జ్ఞానం వుంటే బావుణ్ణు."

"          "

"ఎన్నోసార్లు చెప్పేను అత్తా అని పిలిచినంతమాత్రంలో ఏం మునిగిందని "

"    .    "

"యింతకీ అసలు ఎందుకలా పిలవ్వో చెప్పవు కద"

"  .. . .. "

"నిన్నిలా యీపాటిదానికి అందరూ కల్పించి అంటూంటేనే బావుందా!"

"          "

"అయితే నీకు నిజంగా గర్వం అయి వుంటుంది—లేకపోతే పెడసరం - యింకేమిటి?"

"బావుందండీ-" మెల్లిగా అంది ఒక్క ముక్క ఆమె.

"మరేఁవి టనుకోడం—"

యిలా అతను కేక లేస్తూంటే లక్ష్మమ్మ వచ్చి "బావుందిరా! తప్పుకాదూ! దాన్ని అలా కేక లేస్తావేమిటి?" అని అడిగింది

"అవునమ్మా! అందరిచేతా అనిపించుకోడం దేనికి—ఆ మాత్రంలో దీనికేం పోయిందని "

"వెధవలు ఎవళ్లో అనుకున్నారని దీన్ని కేక లెయ్యడం ఏమిటి—దానికి పిలవాలని లేకపోతే నిర్బంధం ఏమిటి?'

"పోనీ ఎంచేత పిలవదో చెప్పదుకద?"

"అవునమ్మా! కమలా! చెప్పు! ఎంచేత అలా పిలవ్వు? నీ కిష్టంలేదా! యింతలా అందరూ అనుకోడం మనకి మంచిది కాదు—

పోనీ, నువ్వు పిలవక పోయినందువల్ల నాకేం కష్టం లేకపోయినా, వీధిలో వాళ్ళ నోరు కట్టడానికైనా ఆ ముక్క అందూ పోనీ వాళ్ళెవళ్లైనా వున్నప్పుడూ, ఎవళ్లైనా యింటి కొచ్చినప్పుడూ అంటూ వుండు చాలు!" అని కోడలితో అంది. అంతవరకూ మాటాడకండా వింటూన్న కమల కళ్ళంట నీళ్లు తిరిగేయి.

"ఏం చేసేదండీ! మీరు నమ్మరు! అదేఁవిటో ఎన్నిసార్లో నేను మిమ్మల్ని అలా పిలుద్దామని అనుకుంటాను! అనుకోడం ఏమిటి! తప్పకుండా పిలుస్తాను అని ఒట్టు కూడా వేసుగుంటాను కాని . ఎంచేతో మీ దగ్గరికివచ్చి మిమ్మల్ని చూసేసరికి అనలేకపోతున్నాను. అందామని పెదిమలదాకా తెచ్చుకుంటాను . అంతే మరి అనపడదు నేనేం చేసేది! అంతకన్నా నాకేం తెలియడం లేదు! ఎంచేత అలా అవుతూందో అని నాకే ఆశ్చర్యం వేస్తుంది ఆ తర్వాత అనలేకపోయానని నాకు ఏడుపు కూడా వస్తుంది. ఏంచెయ్యనూ!" అంది కమల

"పోనీలేరా! వూరుకుందూ మరేఁవీ అనక!" అని కోడల్ని తనతో తీసుకు పోయింది

*          *          *

"కంది గుండలేదూ!"

"మడిలో వుండి పోయిందండీ!"

"అమ్మని పిలువు వేస్తుంది!"

"ఏమండీ     "

"వస్తున్నా     "

"అదుగో మళ్ళీ యింత చెప్పినా.. ఆ పిలుపు మానవు అత్తా అని పిలవలేవూ!"

అది వినగానే కమల చిన్నబోయి వూరుకుంది.

"నీ కెన్నిసార్లు చెప్పినా జ్ఞానంలేదు. మొండికెత్తిపోతే ఏంచెయ్యనూ!"

"అబ్బ వూరుకుందురూ వింటారు!"

"బావుంది వూరుకోక వురెట్టుకుంటానా? లక్షసార్లు చెప్పేను అది చిన్నబుచ్చుకుంటుందని - నీ సొమ్మేం పోయింది అలా పిలిస్తే—"

" . ... .. . "

"ఆఖరికి వీధులో కూడా అందరినోళ్లోనూ పడిపోయావు నలుగురూ మొహం యీడుస్తున్నా సిగ్గులేదూ! ఈపాటిదానికి మహోయిది చేస్తున్నావు అందరూ పెడసరం అని అనుకోరూ?"

"నాకేమిఁగో అలా పిలవాలని ఎన్నిసార్లు అనుకున్నా ఆవేళకి రాకుండా వుండండీ!"

"ఏడిచావు ఎలా వస్తుంది ? చెప్పినట్టు చెయ్యాలని వుంటేకదూ అయినా యిదేదో ఆఖరికి బావుండేట్టులేదు పైకి అమ్మ ఏఁవీ అనకపోయినా లోపల ఎంత అనుకుంటూందో నీకేం తెలుసు ? పోనీ అత్తా అని పిలవడానికి సిగ్గయితే అమ్మమ్మా అని పిలవరాదూ, మా అమ్మ వరసని-"అని ఇలా అంటూండగా-లక్ష్మమ్మ వచ్చి-

"అదేఁవిట్రా నాయనా! పెళ్ళిఅయిన తర్వాత గూడా 'అమ్మమ్మ' ఏమిటి, అక్కయ్యకూతురయితే మాత్రం నీకు పెళ్ళాం అయింతర్వాత నాకూ కోడలయింది దానికి నేను అత్తగార్ని కొబట్టి యిప్పుడూ అమ్మమ్మా అని అంటే ఏం బావుంటుంది ?" అంగి.

"మాశావా! నా మాట వినవూ యిహ నైనా, అలా పిలవడం మాని సవ్యంగా పిలువు యిందులో తప్పేఁవిటి" అని అతను చెబుతూంటే పోష్టువాడు వుత్తరం తెచ్చి యిచ్చేడు ఆ వుత్తరం లక్ష్మమ్మ అన్నగారి కూతురు దగ్గిరనుండి వచ్చింది అది అతను చదివి - 'అర్జంటుగా ఏదో పనివుండి లక్ష్మమ్మని రమ్మన్నారని' వుందని చెప్పేడు-లక్ష్మమ్మ కూడా ప్రయాణమయి ఆమర్నాడే బయలు దేరింది

*　　　*　　　*

"ఓహో! అత్తేనా! ఏమిటి పిలవగానే వచ్చేశావు ? ఏప్పుడూ లేదు! కొంప మునిగిందే!"

అత్తా! అని గుమ్మంలో కాలుపెట్టగానే పిలిచేసరికి లక్ష్మమ్మకి ఏదో చెప్పలేని సంతోషం కలిగింది — తను ఎన్నడూ ఎరగని ఆనందం అనుభవించింది

"ఏదోలే - చూడాలని వుండి వచ్చేశా - మరి ఏదో అర్జంటుగా రావాలని రాస్తే!" అని అంది

"ఏంలేదత్తా అలాగని రాస్తేగాని నువ్వొస్తావా ? నేనే అలా రాయించేను! అయినా నువ్వింత వేగిరం వస్తావని అనకోలేదు యివాళేదో వుండి ప్రళయం - అందికే మబ్బుకూడా వేసింది!"

"నీ వేళాకోళం పోయిందికాదు-"

"రా అత్తా స్నానం చేద్దూగాని, భోంచేసి తీరుబడిగా మాటాడుకుందాం"

"అలాగేలే" అని అందిగాని తనలో యిలా మాటిమాటికీ మేనకోడలు అత్తా అని చనువుగా పిలుస్తూంటే భరించలేని ఆనందం కలిగినా, తన స్వంతకోడలు పిలవదేదని విచారించకపోలేదు! అలా ఆమె పిలుస్తూంటే అక్కడే ఎన్నాళ్ళయినా వుండిపోవాలని కూడా అనిపించింది ఆమె అలా పిలిచేటప్పుడల్లా ఏదో తనకు కొరత అయిన వస్తువు లభించినట్టు, ఏదో లోటు తీరినట్టు అనిపించింది. ఆ మహానందంలో ఎన్నాళ్ళో వుండిపోయింది ఒకనాడు వుండబట్టక మాటల్లో 'తన కోడలు అత్తా అని ఎంత చెప్పినా పిలవద'ని చెప్పేసింది ఆ వెంటనే మేనకోడలు చిన్న వుపాయం చెప్పింది లక్ష్మమ్మ అలానే చెయ్యడానికి నిశ్చయించుకుంది - ఓనాడు తన కొడుకు దగ్గిరనుండి బయలుదేరి రమ్మంటూ వుత్తరం వచ్చింది.

*　　　*　　　*

ఆవేళనుండీ తనభర్త తనతో మాటాడకపోవడం, దగ్గరకు పిలవకపోవడం, చూసి కమలకి ఏం తోచలేదు అయినా ఎలాగో వూరుకుంది కాని రోజు రోజూ అతను, సమంగా వేళకి యింటికి రాకపోవడం, భోజనం సమంగా చెయ్యకపోడం, మాటి మాటికీ కసురుతో చిరాకుగా వుండడం ఎక్కువయిపోడంబట్టీ, యింటిపట్టున వుండకపోడంబట్టీ - కమలకి ఏమనాలో తోచిందికాదు ఆఖరికి ఏడుపు గూడా వచ్చింది - తనేం తప్పుచెయ్యందే కూడా ఎందుకిలా అవుతూందో అని భరించలేక ఆఖరికి ఆనాడు తమలపాకుఌ అందిస్తూ ఆయన తీసుకోనకపోయినా యిలా అంది -

"ఏమండీ"

"　..　"

"ఏమండీ - మాటాడరు ?"

"ఏవిటి మాటాడ్డం నీ మొహం - పో - అవతలికి నాతో మాటాడవద్దు!"

"అదేవిటండీ అంత కోపం! నాల్గు రోజులయి అన్నమేనా సరిగ్గా తినకండా యింట్లోవుండకండా వున్నారు! ఏం చేశాను ?"

"అందుకూ నీ శెలవే వుండాలా ఏమిటీ? నాయిష్టం—"

"అది కాదండీ కోపం అయితే పోనీండి గాని వేళకి యింత సరిగ్గా తిని పోకూడదా అని! అయినా నేనేం చేశానని యింత కోపం ?"

"ఏమీ లేదు నా ఖర్మ!"

"బావుందండి! ఏదైనా తప్పంటే చెప్పండి ఏంచేశానూ ?"

"ఏం చెయ్యాలి ? ఆఖరికి మా అమ్మని రాకండా చేశావు! మంచి ఎత్తే వేశావు!"

ఇది వినగానే కమలకి గుండె ఆగినంత పని అయింది,—తనేవిటి! అత్తగార్ని రానుండా, చెయ్యడం ఏమిటీ అని!


రు 1000 బహుమానం

లెప్రర్ క్యూర్

(రిజిష్టర్డు)

కుష్టు, బొల్లి, సుఖరోగాదులకు గ్యారంటీ చికిత్స.

అన్ని భాషలలోను కేటలాగు ఉచితం.

లక్ష్మి అండ్ కో

(రిజిష్టర్డు)

H O వాల్తేరు, ఆర్. యస్.

బ్రాంచీలు:

2/135 బ్రాడ్వే, మదరాసు.
గాంధినగర్, విజయవాడ.
కటక్, సికింద్రాబాదు,
రాజమండ్రి etc.

ఒక గంటలో యౌవ్వనము

కామ స్తంభన

ధాతుపుష్టి సంసారసుఖము నిచ్చుటలో సాటిలేనిది నిరాశచెందిన వృద్ధులయందు శక్తి ఉత్సాహము నిచ్చును రు 2 8 0

మదన మంజరి ఫార్మసీ

184 చైనా బజారు రోడ్డు, మద్రాసు
బెజవాడ—శ్రీనివాస మెడికల్ స్టోర్సు పొర్టు రోడు రాజమండ్రి—ఈశ్వరదాస్ & కో మెయిన్ రోడు నెల్లూరు ఆర్యన్ ఫార్మసీ.

నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది. మేహము, నిర్నాళ, నిస్సత్తువ శుక్ల నష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ షబ్బి రు 3-4-0 పోస్టేజి 12 అ
సి. పి. ఏ & కంపెనీ "ఆయుర్వేదసమాజం"
పెరిదేపి-నెల్లూరు జిల్లా.




కుట్టుపని స్వబోధిని (తెలుగు)
"Self Tailoring and Cutting Teacher"
కొత్త పద్ధతిలో కత్తిరించి కుట్టు పాఠములు గలది ప్రతి దర్జీవారికి, స్త్రీలకు ముఖ్యము. 82 పేజీలు 36 పటములుగల పుస్తకము రు 12 పోస్టుఖర్చులు రు 8-మహారాజ పుస్తకశాల అరుణాచల మొదలి వీధి, 26 బీటు, మద్రాసు





"అదేవిటండీ, యిలాటిమాటలు! నే నెందుకలా చేస్తాను? నాకేం కష్టమా?"

"ఏమో మరి అలాగే వుంది"

"యింక నేనేం చెప్పేది! ఏవిట యిందో చెప్పరూ"

"ఇదుగో చూడు మాఅమ్మని రమ్మని రాత్తే రావడానికి బదులు ఏవని రాసిందో!"

"ఏవిటి రాసేరండి?"

"ఇదంతా నీనించే—నీ మొండితనం నించే"

"అసలేవిటి రాసేరూ?"

"రెండక్షరాలు నోటంట అనడానికి చచ్చిపోయావు! ఎంతచెప్పినా విన్నావా? నీతో మాటలేమిటి?"

"ఏమండీ నేనేంచేశానని?"

"ఏం చేశావు! అత్తా! అని పిలవమని ఎందరం అఘోరించినా, కడకి నోటంట తెగించి అదే అన్నా మొండి కత్తి పోయావు అదే ఆఖరికి యింతవరకూ వచ్చింది!"

"ఇంతకీ ఏమిటయిందో చెప్పండి! - అత్తా అని పిలిచే మరో అమ్మాయినిగాని తెస్తున్నారా ఏమిటి? మీరు" అని వేళాకోళంగా అంది.

"చాల్లే నీ వెటకారం - నాకింతవరకూ ఆ వూహే తోచలేదు. లేకపోతే యింత వరకూ రాకముందే ఆపని చేద్దును"-అన్నాడు

"అయితే ఏమయింది?"

"అక్కడ తన మేనకోడలు, అత్తా అని ఎంతో ఆప్యాయంగా పిలుస్తూందిట, తనకి అక్కడే హాయిగా వుందిట! యిక్కడికి వస్తే మళ్ళీ యథాప్రకారమేనని, అంచేత తను తన బుద్ధితిరిగేవరకూ అక్కడే వుండి పోతాననీ ఖచ్చితంగా రాసింది-యిహ నేం చెయ్యడం"

"మంచి బావుందండీ! యీ పాటి దానికి అంత పట్టింపుచేస్తారనుకోలేదు!"

"లేదు చాలా సంతోషిస్తారనుకున్నావు కదూ"

"అక్కడ ఎంతకాలమని వుంటారు?"

"అంతేగాని నేను తప్పకండా, పిలుస్తాను, రమ్మనమండి అని అనవు! దానికేం అది ఎన్నాళ్లున్నా మహారాజులా పువ్వుల్లోపెట్టి పూజిస్తారు ఎంత పుణ్యం చేస్తే పెద్ద దిక్కుదొరుకుతుంది! ఏమిటో అనుకుంటున్నావు!"

"ఇది మరీ బావుందండీ నేనిలా అవుతుందనుకున్నానా?"

"పోనీగాని నీకెందు కింత పంతం! ఎందు కిన్నిసార్లు చెప్పినా పిలవ్వు-ఇప్పుడు చెప్పు నాతో-ఏమిటో!"

" . . "

"చెప్పు—"

"ఏమిటి చెప్పేదండి "

"అదే ఎందుకు పిలవ్వు—"

"అదేమిటోనండీ-నాకు తెలీదు! నే చెప్పలేను"

"అదుగో అయితే, యిహ నీకూ నాకు పడదు"

"ఏఁవీ లేదు వుట్టినే—"

"బావుంది వాలకం—"

"ఏం చెప్పనండీ- ఏం లేం దే-మరే కారణం లేదు ఎన్నోసార్లు అనుకుంటాను పిలువద్దాఁవని ఆవేళ కొచ్చేసరికి నోటంట రాదు! పిలవలేకండా వున్నాను, సిగ్గూ కాదూ, చిన్నతనంకాదూ, ఏఁవీ కాదు, అదేఁవిటో తెలీదు! ఏం చెయ్యడం?"

"ఇది బావుంది అన్నిటికంటేను!"

"యిహనుండి తప్పకండా పిలుస్తాను! రమ్మని రాయండి!"

"అలా రాయనా?"

"రాయండి ఒట్టు—"

"వచ్చింతర్వాత పిలవకపోతే నువ్వన్నట్టే-అత్తా అని పిలిచే పిల్లని పెళ్ళి చేసుకుంటాను"

"పోనీ అలాగేలెండి—"

"అలా అయితే యిప్పుడే నువ్వు కూడా అలా పిలుస్తూ ఒక వుత్తరం మీ అత్తగారికి రాసుగో!"

"అబ్బ నే రాయలేనండీ! అదోలా వుంటుంది!"

"అలాగయితేనే చిక్కు నే చెబుతున్నాకదూ అలా అయితేనేగాని రాదు!"

"మధ్య మీరూరుకోరుకదా!"

* * *

ఇంటిముందు బండీ ఆగిన చప్పుడు అయింది కమల ఆతృతతో, "అదుగోనండీ వచ్చినట్టుంది!" అంది

"మళ్ళీ మొదలెట్టేవు సుమీ!"

"లేదండీ! అత్తగారు వచ్చినట్టుంది!"

"వెళ్ళి రమ్మను—"

"అబ్బ! మీరే వెళుదురూ! నాకదోలా వుంటుంది!"

"అలాగయితే ఆ బండిలోనే తిరిగి వెళ్ళి పోతుంది!"

"మీరు మరీనండీ!" అని అంటూ వీధిలోకి వెళ్లి వస్తూన్న అత్తమ్మని "రండి అత్తా!" అని పలకరించింది—

ఆ మాట వినగానే లక్ష్మమ్మ పొంగిపోయింది చేత్తో పట్టుగున్న సామాను అక్కడే వదిలేసి కోడలి చెయ్యి పట్టుగుని లోపుకి వెళ్లిపోయింది.

"ఏమండీ యీ పాటిదానికే యింత పని చేస్తారా? యిక్కడ ఆయన పెద్ద గందరగోళం చేశారు!"

"అదుగో మళ్ళీ అలాగే పిలుస్తావేమిటే!" అన్నాడతను—

"మీ రూరుకుందురూ!" అని వెనకేసుకుంది

"అమ్మ అలాఅయితే అత్తా అని పిలిచే మరో పిల్లని ఎక్కడన్నా చూడే. దీనికి విడాకులిచ్చేద్దాం!" అన్నాడు నవ్వుతూ

"అదేవిటి - అలాటి మాటలు" అని వింతగా అడిగింది లక్ష్మమ్మ.

"నీ కోడలే చెప్పింది - యిహమీదటి నుండీ అలా పిలవకపోతే, మళ్లీ పెళ్ళి జేసుకోవచ్చని!"

"సరిపోయింది యిద్దరికీ!"

"రండత్తా ఆయనతో ఏమిటి! ఫలహారం చేద్దురుగాని." అంది కోడలు

ఇది వినగానే తన మేనకోడలు చెప్పిన ఎత్తు ఫలించిందని లక్ష్మమ్మ చాలా సంతోషించింది.

* * *

మర్నాడు లక్ష్మమ్మని పలకరించడానికి అందరూవచ్చి గుమ్మంలో కూర్చుని పిచ్చాపాటి మాటాడుకుంటూండగా ఏదో పనుండి - కమల యివతలికి వచ్చి - "ఏమండీ అత్తా యిలా లోపలికోసారి రండి" అని పిలిచింది.

అది విని - "చూశావే అమ్మడూ యిప్పుడెలా పిలుస్తూందో" అంది సముద్రాలు

"నే చెప్పలేదుటే- అనుభవంమీద అదే తెలుసుకొంటుందని వూరికే యిదయిపోయారు అందరూను"

"అయినా దానికిమాత్రం తెలీదుటే - అలా ఆడించిందిగాని -"

"నిజంగా అత్తా కోడలూ వుంటున్న 'కళ' వచ్చింది యింటికి -" యిలా అంటూండగా - కెరటాలు - యినపగరిట పట్టుగువచ్చి -

"ఏం లక్ష్మమ్మా! పైని గూర్చున్నావు! యింట్లో ఎవరూ లేరూ! యివాళ అగ్గిపుల్లలు యింటో నిండుకున్నాయి కాస్త నిప్పుపట్టుకు వెళతాను!" అంది

"వెళ్ళమ్మా కోడలు ఇస్తుంది!"

"ఏవండోయ్ కోడలని మళ్లీ పిలుస్తున్నారు? అయితే ఏదో విశేషం వుంది!" అంటూ లోపుకి వెళ్ళి నిప్పుతీసుకుంటూ వుంటే—

"ఏమండీ మా అత్తగారు వస్తున్నారా?" అని కమల అడిగింది

అది వినగానే కెరటాలు—

"నీకడుపు చల్లగా! చక్కటి కొడుకుని కనాలి! ఏదీ - మళ్ళీ పిలువూ!"

"వూరుకోండీ - అవేం మాటలూ!"

"ఎలా నేర్చుగున్నావు.. అయినా నువ్వు తెలివైనదానివేలే!" అంటూ చుట్టూ చూసింది "ఎంచక్కా చేసుకున్నావే - యిల్లంతాను! పెద్ద ఆఫీసర్ల బంగళాలా వుంది!" అని తిరిగి వెళ్ళిపోతూ వస్తూన్న లక్ష్మమ్మను చూసి—

"అత్తగారి వనిపించుకున్నావులే!" అంది లక్ష్మమ్మ నవ్వుతూ వూరుకుంది. ★


కాంచనద్వీపం
రాబర్ట్ లూయీ స్టీవెన్సన్
అనువాదం: నండూరి రామమోహనరావు
ఆంధ్రగ్రంథమాల,



ఎదిగే పిల్లల
సంక్షేమానికి అతి ప్రధానం
పిల్లలు చురుకుగా, పుష్టికరంగా ఎదుగుటకు విటోఫెర్రిన్ సాటిలేని సాధనం రక్తక్షీణత, విటమిన్ లోపం, అన్ని రకాల నీరసాలతో బాధపడు వారికి ఇది మంచి టానిక్ గా పనిచేస్తుంది.

విటోఫెర్రిన్

ఉత్పత్తిదారులు:
ది మైసూరు ఇండస్ట్రియల్ & టెస్టింగ్ లాబరేటరీ లిడ్.
మల్లేశ్వరం, బెంగుళూరు.

సెల్లింగ్ ఏజెంట్లు:
బెస్ట్ అండ్ కంపెనీ లిమిటెడ్.
పోస్ట్ బాక్స్ నం. 63, మద్రాసు.